



సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

శనివారం 24 మే 2025 4 పేజీలు

# పంచాయతీ ఎన్నికలకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం






సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

- రెడీగా ఉన్న ఎన్నికల సంఘం..!
- జూన్ చివరి వారంలో లేదా జులై ప్రారంభంలో ఎన్నికలు
- ఆ వెంటనే వరుసగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ,మున్సిపాల్టీలకు కూడా..
- తాజాగా పంచాయతీలకు రూ.153 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్
- పార్టీపరంగా 42% రిజర్వేషన్లతో ముందుకెళ్లాలని ఆలోచన

2లో

## కోర్టులో ఏసీబీ దాడులు

- ఏసీబీ వలలో ఇద్దరు అధికారులు
- ఏసీబీ డీఎస్పీ రాజశేఖర్ గౌడ్ వెల్లడి

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి

కామారెడ్డి జిల్లా కోర్టులో ఏపీపీ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ నాయక్, అలాగే సంజయ్ కానిస్టేబుల్ ఏసీబీకి చిక్కారు. గతంలో 2018లో ఒ కేసు రిజిస్ట్రేషన్ అయింది. ఆ కేసు ముగించే క్రమంలో బాధితుల దగ్గర 15 వేలకు ఒప్పందం కుదుర్చు కున్నారు. పది వేల రూపాయలు బాధితులు డబ్బులు ఇచ్చే క్రమంలో ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డారు అని (మిగతా 2లో)







## రైతన్నను రాజును చేయడమే లక్ష్యం

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

సూర్య -బాన్సువాడ

రైతన్నను రాజును చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ సహకార కేంద్రం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు .రైతన్నను అన్ని విధాలుగా చేయూత నివ్వడానికి సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నారు. 30 కిలోల జిలుగు విత్తనాల ధర రూ 4,275 ఉండగా ప్రభుత్వం 50% సబ్సిడీతో రూ 2,137.50 కి అందజేస్తున్నదన్నారు. సబ్సిడీపై వచ్చే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారితిరుమల ప్రసాద్ సొసైటీ చైర్మన్ ఎర్వల కృష్ణరెడ్డి, నాయకులు జంగం గంగాధర్, ఎజాజ్, మోహన్ నాయక్, నార్ల సురేష్, నార్ల రవీందర్, మాజీ కౌన్సిలర్ లింగం, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ళు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- ఇప్పటికి వరకు 3.67లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- దాదాపు పూర్తి కావచ్చిన ధాన్యం కొనుగోలు
- 851 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు
- గతేడాది తో పోలిస్తే 40% ఎక్కువగా ధాన్యం కొనుగోలు

2లో

సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి



# పంచాయతీ ఎన్నికలకు ..... కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. జూన్ చివరి వారంలో లేదా జులై ప్రారంభంలో ఎన్నికలు జరపాలని ప్లాన్ చేస్తున్నది. దీనికి కొనసాగింపుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు కూడా వరుసగా చేపట్టాలని ఆలోచిస్తున్నది. గ్రామ పంచాయతీలకు సంబంధించిన కొన్ని పెండింగ్ బిల్లులను తాజాగా క్లియర్ చేయడం, మరికొన్నింటిని త్వరలోనే క్లియర్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండడం, జూన్ 2 నుంచి 'రాజీవ్ యువ వికాసం' స్కీమ్ ప్రారంభిస్తుండటం, అదే నెలలో వీలైనంత మందికి రేషన్ కార్డులు పంపిణీ చేయాలని నిర్ణయించడం వంటి చర్యలన్నీ ఎన్నికల సన్నాహాల్లో భాగమేనన్న ప్రచారం జరుగుతున్నది.మరోవైపు ఇప్పటికే జిల్లాల పర్యటనలు కొనసాగిస్తున్న సీఎం రేవంత్రెడ్డి.. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో వన్ టు వన్ మాట్లాడుతున్నారు. ఇది కూడా ఎన్నికల సన్నద్ధతలోనే భాగమేనని రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎన్నికల నిర్వహణపై ఉన్నతాధికారులకు సర్కార్ నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు సమాచారం. పంచాయతీ ఎన్నికలకు రెడీ అవుతున్న రాష్ట్ర సర్కారు.. ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించింది.పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, రాజీవ్ యువ వికాసం, రేషన్ కార్డుల పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజల్లో విశ్వాసం నింపే ప్రయత్నం చేస్తున్నది. పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లుల్లో తాజాగా రూ.153 కోట్లను విడుదల చేసింది. మరికొన్ని పెండింగ్ బకాయిలు దాదాపు రూ.300 కోట్లను కూడా త్వరలో రిలీజ్ చేయనున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఇదంతా ఎన్నికల సన్నాహాల్లో భాగమేనన్న ప్రచారం జరుగుతున్నది. మరోవైపు యువతకు స్వయం ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమాన్ని జూన్ 2 నుంచి ప్రారంభించనుంది. 5 లక్షల మందికి దీనితో లబ్ధి చేకూరనుంది. ఇందులో స్థానిక యువతతో పాటు కాంగ్రెస్ కేడర్కు ప్రయోజనం దక్కనుంది. జూన్ నెలలోనే వీలైనంత మంది అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. పెండింగ్ రైతు భరోసాను కూడా ఈ నెల చివరి వారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేయాలని భావిస్తున్నది.

**- సీఎం జిల్లాల పర్యటనలు.. ఎమ్మెల్యేలతో భేటీలు..**

జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వరుస పర్యటనలు, నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలతో భేటీలు కొనసాగుతున్నాయి. ఇవి కూడా స్థానిక ఎన్నికల సన్నాహాల్లో భాగమేనన్న చర్చ జరుగుతున్నది. కొన్ని వారాలుగా సీఎం వివిధ జిల్లాల్లో పర్యటిస్తూ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా స్థానిక సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి హామీ ఇస్తున్నారు.ఎమ్మెల్యేలతో జరిగిన భేటీల్లోనూ ఎన్నికల సన్నద్ధత, స్థానిక నాయకులతో సమన్వయం, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సందేశాల గురించి ప్రస్తావిస్తున్నారు. జూన్ చివరలో లేదా జులై మొదటివారంలో స్థానిక ఎన్నికలు ఉంటాయని ఈ సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చినట్లు చర్చ జరుగుతున్నది. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా వివిధ అభివృద్ధి, పార్టీ కార్యక్రమాలతో నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారు.

**- ఎన్నికల ఆలస్యం..**

గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు గతేడాది ఫిబ్రవరిలోనే ముగియగా.. దాదాపు ఏడాదిన్నరగా ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,600 కోట్లకు పైగా ఆగిపోయాయి. పాలకవర్గాలు ఎన్నికైతేనే ఈ నిధులు వస్తాయి. ఇక మండల పరిషత్, జిల్లా పరిషత్ పాలకవర్గాల గడువు నిరుడు జులై మొదటి వారంలో.. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల గడువు గత నెలలోనే ముగిశాయి.వీటికి కూడా ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోయాయి. ప్రస్తుతం అన్నిచోట్లా ఇన్చార్జ్?ల పాలన నడుస్తున్నది. ఒక అధికారి ఐదారు పంచాయతీలు, మండలాలు లేదా మున్సి పాలిటీలను పర్యవేక్షిస్తుండటంతో అభివృద్ధి పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా, కాంగ్రెస్ పార్టీ పదేండ్ల తర్వాత అధికారంలోకి రావడంతో గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు స్థానిక పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.ముఖ్యంగా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ లాంటి పదవులు దక్కితే పార్టీ మరింత బలపడుతుందని కాంగ్రె స్ పెద్దలు భావిస్తున్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో.. జూన్ చివరి వారంలో లేదా జులై మొదటి వారం నుంచి స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

**- ఎన్నికల తేదీలపై మూడు ప్రతిపాదనలు**

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణనకు నిర్ణయం తీసుకున్నందున రాష్ట్ర బిల్లులకు ఆమోదం లభిస్తుందా లేదా ? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు గ్రామాల్లో సర్పంచ్లు లేక ఏడాదిన్నర కావస్తున్నది. దీంతో కొన్ని నెలలుగా ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆగిపోయి, పల్లెల్లో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లతో ముందుకెళ్లాలని సర్కార్ భావిస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. అధికారులు ఏయే తేదీల్లో ఎన్నికలు నిర్వహించాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి మూడు ప్రతిపాదనలను అందజేసినట్లు తెలుస్తున్నది.జూన్ చివరలో, జులై మొదటివారంలో పంచాయతీ ఎన్నికలు పూర్తి చేయడం.. ఆ తరువాత వెంటనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లడం లాంటివి ఇందులో ఉన్నాయి. ఒకవేళ ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు అయితే.. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు పెట్టాలనే ప్రపోజల్ కూడా ఇందులో ఉంది. మరోవైపు ఇప్పటికే స్థానిక ఎన్నికలకు అన్నివిధాలా సిద్ధమైన రాష్ట్ర ఎన్నికల సంఘం.. ఎలక్షన్ డేట్స్, రిజర్వేషన్ల కోసం ఎదురుచూస్తున్నది.

**- పార్టీ పరంగానే 42% రిజర్వేషన్లు**

వాస్తవానికి పంచాయతీ ఎన్నికలను గతేడాదే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందుకోసం సమగ్ర కుల గణన సర్వే చేపట్టింది. అనంతరం బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించే బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి, ఆమోదించింది.ఇందుకు సంబంధించిన రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో ఉన్నాయి. ఇటీవల కేంద్ర కేబినెట్ కూడా దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన చేసేందుకు అంగీకరించింది. ఇది పూర్తయ్యేందుకు మరో ఏడాదిన్నర సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రం చేసిన కుల గణన వివరాల ఆధారంగా పంపిన స్థానిక బీసీ రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదిస్తారా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు చాలా సమయం పట్టే అవకాశం ఉండడంతోఈసారి పార్టీ పరంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో తప్పని పరిస్థితుల్లో ఇతర పార్టీలు కూడా బీసీలకు అంతే మొత్తంలో రిజర్వేషన్లు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. దీంతోనైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు అవుతుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి.

# బాలుడు ప్రాణం తీసిన పప్పు డేకీస

## - చికిత్స పొందుతు మృతి

**సూర్య,లింగంపేట్**

బాలుడు ప్రాణం తీసిన పప్పు డేకీస ప్రమాదవశాత్తు పప్పులో పడిన కటారియ సాత్విక్ 02 అనే బాలుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.వివరాలు ఇలా ఉన్నాయి లింగంపేట్ మండలంలోని ముంబాజిపేట్ తండాకు చెందిన రాజ్ కుమార్,లలిత కుమారుడు సాత్విక్ను తీసుకొని బుధవారం బంధువుల పెళ్లికి కుటుంబ సమేతంగా గాంధారి మండలం గౌరారం తండాకు వెళ్లారు.పెళ్లిరోజు వంటలు చేస్తుండగా వర్షం కురవడంతో చేసిన వంట డేకీసలను పెళ్లికూతురు ఇంట్లో పెట్టారు.పెళ్లి హడావుడి ఒక దిక్కు,వర్షంలో బాలున్ని తల్లి దండ్రులు మర్చిపోయారు.బాలుడు ఆడు కుంటు వంట డేకీసలో పడ్డాడు. బాలుడు డేకీసలో పడ్డాడని గమనించిన వెంటనే బాలున్ని నిజమాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేస్తుండగా శుక్రవారం ఉదయం మృతి చెందాడని తండా వాసులు తెలిపారు.బాలుడు మృతితో తండాలో విషాద ఛాయలు నెలకొన్నాయి.





# కోర్టులో ఏసీబీ దాడులు

(మొదటి పేజి తరువాయి)

అవినీతి_ నిరోధక శాఖ డిఎస్పి రాజశేఖర్ గౌడ్ తెలిపారు. వారిని త్వరలో నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని ఆయన తెలిపారు.తదుపరి విచారణ చేపట్టిన అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపరస్తామని తెలిపారు . అలాగే వారి ఇంట్లో కూడా సోదాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు గాని ప్రభు త్వ ఉద్యోగులు గాని సిబ్బంది గాని ఎవరైనా వేదిస్తే ఇబ్బందులకు గురి చేస్తే టోల్ ఫ్రీ1064 ను ఆశ్రయించాల్సిందిగా ప్రజలను కోరడం జరుగుతుంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలను ఎవరైనా లంచాలు అడిగితే ఏసీబీ ని ఆశ్రయించాలని ఏసిబి డిఎస్పి రాజశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో, కామారెడ్డి పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సైలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్ళు త్వరితగతిన పూర్తి చేయాలి

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్నీ త్వరగా కాంటాలు పూర్తి చేసి వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. శుక్రవారం భిక్కనూర్ మండలం లోని జంగంపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అకాల వర్షాలు ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలి అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 446 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 70,358 మంది రైతుల నుండి 851 కోట్ల విలువైన 3.67 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని తెలిపారు. దీంట్లో 1.88 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1.78 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని. ఇప్పటి వరకు 56,544 రైతులకు 762.99 కోట్ల వరకు డబ్బులు చెల్లింపులు కూడా పూర్తయ్యాయనీ తెలిపారు. గతేడాది పోలిస్తే అనగా రబీ 2023-24 ఇదే సమయానికి 58694 రైతుల నుండి 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగా, అదేవిధంగా ఆ క్రిందటి ఏడాది అనగా రబీ 2022-23 సీజన్ లో 44707 రైతుల వద్ద నుంచి 2.52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ను కొనుగోలు చేశామన్నారు.గత రెండు సీజన్ లతో పోలిస్తే ఈ రబీ సీజన్ లో ధాన్యం కొనుగోళ్ళు, రైతులకు చెల్లింపులు 40% అధికంగా చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు సన్న రకం ధాన్యం అమ్మిన 27,542 మంది రైతులకు బోనస్ చెల్లింపులకు రూ.82.96 కోట్లు ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాలలో అకాల వర్షాలను దృష్టి లో ఉంచుకొని కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్ లను ఏర్పాటు చేయాలనీ మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. అలాగే రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే క్రమములో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ జి.రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లిఖార్జున బాబు, డి.సి.ఓ రామ్మోహన్, సంబందిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ అధికారినంటూ బెదిరింపు

## - కేసు నమోదు

**సూర్య మాక్లూర్**

ఏసీబీ అధికారిని అంటూ మాక్లూర్ ఎంపీడీవోకు బెదిరింపు ఫోన్ కాల్ ఘటన చోటుచేసుకుంది.స్థానిక ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం ఈ నెల 22వ,తేదీన ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఏసీబీ అధికారులమంటూ పరిచయం చేసుకొని ఇటీవల ఏసీబీ అధికారులకు అరెస్టు అయిన పంచాయతీ కార్యదర్శి మీకు సంబంధాలు ఉన్నాయంటూ మిమ్మల్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామంటూ అలా అరెస్టు చేయకుండా ఉండాలంటే మాకు 2లక్షల రూపాయలు ఇవ్వాలంటూ ఫోన్లో బెదిరించారు.ఇట్టి విషయాన్ని ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఏసీబీ అధికారులను సంప్రదించగా అది ఫేక్ కాల్ అని ఏసీబీ అధికారులు తెలపగా ఎంపీడీవో లక్ష్మారెడ్డి స్థానిక మాక్లూర్ ఠాణాలో పిర్యాదు చేయగా అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలి

**సూర్య- నవీపేట్**

రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడును పొందాలని శాస్త్రవేత్త రాకేష్ అన్నారు. మండల కేంద్రంలో గల రైతు వేదికలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నవీన్ అధ్యక్షతన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజన్ కు ముందే మహోత్తరమైన మంచి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా మంచి పరిణామమని శాస్త్రవేత్తలే రైతుల దగ్గరికి వచ్చి చేసే ఇటువంటి కార్యక్రమాలు రైతులకు చాలా ఉపయోగపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. రుద్రూర్ ప్రాంతీయ



వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్. రాకేష్, పద్మావతి మాట్లాడుతూ. వ్యవసాయంలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అర్ధించే పద్ధతుల గురించి వివరించారు. రైతులు పంటలకు సిఫారసు చేసిన మోతాదులోనే యూరియాను వినియోగించాలన్నారు. చీడపీడల ఉధృతిని బట్టి సరైన మోతాదులో రసాయనిక మందులు వాడడం, రషీద్ తీసుకోవడం, విత్తన శుద్ధి చేసుకోవడం మొదలగు అంశాల మీద అవగాహన కల్పించారు. ప్రస్తుతం నెలకొంటున్న వాతావరణ మార్పులను వివరిస్తూ, పంట మార్పిడి సరైన ప్రణాళికతో చేస్తే రైతులకు ఎక్కువ దిగుబడి, తక్కువ ఖర్చు మరియు భూమికి దీర్ఘకాలిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ నరేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినోద్, సుప్రియ, వసంత్, అపూర్వ మండల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు ఫ్రెండ్లీ విద్యా విధానాన్ని అమలు చేయాలి

**సూర్య- బిక్కనూర్**



ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులతో స్నేహపూరిత విద్య విధానాన్ని అమలు చేయాలని, మండల విద్యా వనరుల అధికారి రాజా గంగారెడ్డి చెప్పారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం వెనుక ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థు లతో స్నేహపూర్వక వాతావరణంలో విద్యను బోధిస్తే మరిన్ని మంచి ఫలి తాలు వస్తాయని, విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్తారని సూచించారు. ఈ విద్యా సంవత్సరం రెట్టింపు స్థాయిలో ప్రభుత్వ పాఠశా లల్లో విద్యార్థులు చేరే విధంగా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ద్వారా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శ్రీనాథ్, మండల విద్యా వనరుల కార్యాలయ సిబ్బంది వైద్య సంపత్, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వివాహ శుభకార్యంలో పాల్గొన్న సొసైటీ చైర్మన్

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని ఇసన్నపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాములు కుమారుని వివాహం శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ శుభకార్యానికి పెద్దమల్లారెడ్డి సింగిల్ విండో సొసైటీ చైర్మన్ బాలగౌని రాజాగౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ శుభకార్యంలో సొసైటీ వైస్ చైర్మన్ గుడిసె విట్టల్, నాయకులు మన్నె యాదగిరి, మంద బాబు, పరశురాములు తదితరులు ఉన్నారు

## అర్ధరాత్రి వరకు పాన్ షాప్ తెరిచీ ఉంచిన ఒకరికి జైలు శిక్ష

**సూర్య - మోపాల్**



నిజామాబాద్ నగరంలో అర్ధరాత్రి వరకు పాన్ షాప్ తెరిచి ఉంచిన ఒకరి కి న్యాయస్థానంజైలు శిక్ష విధించింది. ఒకటో టౌన్ ఎస్ఎవో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం అర్సపల్లి లోని ఓ పాన్ షాప్ అర్ధరాత్రి వరకు తెరిచి ఉండడంతో పోలీసులు పాన్ షాప్ యజమాని షేక్ ఫాయుజ్ ను అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా అతడికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎస్ఎచ్ వో తెలిపారు.

## ఘనంగా కొనసాగుతున్న మాతమ్మ ఉత్సవాలు

**సూర్య- బిక్కనూర్**



మండల కేంద్రంలోని స్థానిక గిద్దె హరిజనవాడలో ఉన్న మాతమ్మ ఆలయ 24వ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయ ఆవరణలో గణపతి పూజ, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులతోపాటు, పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## ఐదవ రోజు శ్రీ భగవద్గీత భాగవత కథ

**సూర్య రెంజల్**



మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ గోదావరి నది ఒడ్డున నిర్మించిన శ్రీ సీతారామ దమ్ సంత్ ఆశ్రమ నందు ఏడవ శనీశ్వరాలయ వార్షికో త్సవం పురస్కరించుకొని యజ్ఞ హోమ మహా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం 5వ రోజును పురస్కరించుకొని శ్రీమద్ భగవత్ కథ పారాయణాన్ని పరమ పూజ్యులు దేవ్ మూర్తి భగవత్ చార్య అనంత్ మహారాజ్ గారిచే శ్రీ భగవద్గీత భాగవత కథ సారాంశాన్ని భక్తులకు తెలియజేశారు. అనంతరం యజ్ఞం హోమ కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. మహారాజ్ మహా మండలేశ్వర్ సీతార్ఘాందాస్ మహారాజ్ ఆధ్వర్యంలో శనీశ్వర ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.భక్తులు ఆలయంలో చేపడుతున్నటువంటి కార్యక్రమంలో పాల్గొని భగవంతుని అనుగ్రహం పొందాలన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం మేరకు అన్న ప్రసాద అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ స్వామీజీలు, వేద పండితులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## సైనిక్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సన్ వే స్కూల్ విద్యార్థిని

**సూర్య.బీర్కూర్**



బీర్కూరు మండల కేంద్రానికి చెందిన ఇండ్ల వైష్ణవి ఇటీవల వెలువడినటువంటి సైనిక ఫలితాలలో ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి ఎంఈఓ వెంకన్న చేతుల మీదుగా శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండల విద్యాధికారి వెంకన్న మాట్లాడుతూ ఉత్తమమైన మార్గం ఎంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అప్పుడే తల్లిదండ్రులకు పేరు, ప్రతిష్టలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ పరమేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

**సూర్య- బిక్కనూర్**



రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. దోమకొండ మండల కేంద్రానికి చెందిన పోతుల రాహుల్ ద్విచక్ర వాహనంపై కామారెడ్డి నుండి మండల కేంద్రానికి వస్తున్నట్లు తెలిపారు. 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజా వద్ద వెనుక నుండి ఆయన ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టిందన్నారు.దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

## మున్సిపాల్ వాహనం బోల్తా తృటిలో తప్పిన పెను ప్రమాదం

**సూర్య - మోపాల్**



నగరంలో వర్ని చౌరస్తా నుండి ఇంద్రాపూర్ రోడ్డు వరకు పరిస్థితి దయానీయంగా ఉందని ప్రజా ప్రతినిధులు ఎందరు మారిన రోడ్డు తల రాత మాత్రం మారడం లేదని ఇంద్రాపూర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఇంద్రాపూర్ రోడ్డులో చెత్తను తీసుకెళ్తున్న వాహనం బోర్ల పడడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం వందల వాహనాలు రద్దిగా ఉండే రోడ్డు పరిస్థితి దయానీయంగా ఉండడంతో కాలనీ వాసులు, వహన చోదకులు దిన దిన గండంగా గడుపుతున్న మ్మన్నారు. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తున్నారు. అడుగడుగునా గుంతలు ఉండడంతో రోడ్డు పై వాహనాలు నడపడానికి ప్రాణ భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని వాహనాలు నడుపుతున్నారు. ఉదయం చెత్తను తీసుకోవడానికి వచ్చిన మున్సిపల్ చెత్త వాహనం గుంతల మయమై రోడ్డులో వెళ్తు అదుపు తప్పి బోర్ల పడింది. దీనితో అందులో ఉన్న కార్మికులకు ఎలాంటి అపాయం జరగక పోవడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. స్కూల్ సు ప్రారంభమైతే రోజుకు 30 నుండి 40 వాహనాలు తీరగుతూ ఉంటాయి. సెలవులు కావడంతో వాహనములు తిరగడం లేదు ఇక 15 రోజులు ఐతే ఇంద్రపూర్ కల్లు డిపో రోడ్డు రద్దిగా ఉంటుంది. అధికారులకు గత 5 సంవత్సరాలనుండి అధికారులకు విన్నవించిన పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు ప్రజా ప్రతినిధులు కళ్ళు తెరచి రోడ్డు మారమ్మతులు చేపట్టే విదంగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## పదవి లేకపోయిన ప్రజా సేవలో మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్

**సూర్య ఎల్లారెడ్డి**



పదవి లేకపోయిన ప్రజాసేవ చేయడమే లక్ష్యం అని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు ఎర్రమన్ను కుచ్చాలో గల వాటర్ ట్యాంక్ లోకి వెళ్ళే మిషన్ భగీరథ పైప్ లైన్ పట్టణ కేంద్రంలోని పాత పెట్రోల్ పంపు దగ్గర పగిలిపోవడంతో గత 2రోజుల నుండి నీటి సరఫరా నిలిచిపోయి 1వ వార్డు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకొని మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మహేష్, ఏఈ వినోద్ సహకారంతో జెసిబి తెప్పించి పైప్ లైన్ ధ్వంసమైన చోట తవ్వించి మరమ్మత్తులు చేయించారు. పదవి లేకపోయిన పైప్ లైన్ పనులు పూర్తయ్యే వరకు దగ్గరుండి మిషన్ భగీరథ సిబ్బందితో మరమ్మత్తులు చేయించిన మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ ను పలువురు అభినందించారు.

## ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం

**సూర్య కామారెడ్డిజిల్లా ప్రతినిధి,**

ప్రపంచ పర్యవరణ దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం రోజు దగ్గి శివారులో గల మంచిప్ప ఆటవి ప్రాంతంలో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమములో ముఖ్య అధిదిగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ పాల్గొన్నారు. ఆటవి ప్రాంతంలో గల ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేయడం జరిగింది . ఈ సందర్భంగా మాట్లాడుతు యునైటెడ్ స్టేట్స్ మరియూ పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన పిలుపు మేరకు "అంతం చేద్దాం ప్లాస్టిక్ కాలుష్యం ప్రపంచవ్యాప్తంగా " అనే నినాదంతో ముందుకు వెళ్లాలని సూచించారు. 5 మైక్రాన్ కన్న ఎక్కువ మందం గల ప్లాస్టిక్ ను వాడకూడదు అని శుచించారు, అవి భూమిలో కలిసిపోవడానికి వందల సంవత్సరాలు పడుతున్నదని తేలిపారు,మొక్కలు నాటి పర్యవరణాన్ని పచ్చదనంగా శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపినారు .ఈట్టి కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నికిత బోగా , ఆటవి డివిజనల్ అధికారి పి వి . రామకృష్ణ, అటవీ రేంజ్ అధికారి వి.రమేష్, సెక్షన్ అధికారులు ముభాషీర్, సలీం, శ్రీదర్, ఆటవి సిబ్బందీ పాల్గొన్నారు.

## ఈనెల 25న జరగనున్న గ్రామ పాలన ఎంపిక పరీక్షను

# పకడ్బందీగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



ఈ నెల 25 న జరగనున్న గ్రామ పాలన ఎంపిక పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామ పాలన అధికారుల ఎంపిక పరీక్ష నిర్వహణకు ఇన్విజిలేటర్స్ లకు, పలువురు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 25 న ఆదివారం రోజున కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో (అటానమస్) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం గం.10.30 నుండి మధ్యాహ్నం గం.1.30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో 402 మంది పరీక్ష రాస్తున్నట్లు, గతంలో వి.ఆర్.ఒ , వి.ఆర్. ఏ. లుగా పనిచేసిన వారు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో పాటు ఫోటోతో కలిగిన గుర్తింపు కార్డ్ వెంట తీసుకురావాలని తెలిపారు. ఈ పరీక్ష నిర్వహనకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలనీ తెలిపారు. పరీక్ష కేంద్రంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. పరీక్ష జరుగు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో ఏఎన్ఎం లను అవసరమైన మందులతో సహా డిప్యూట్ చేయాలని తెలిపారు. పరీక్ష హాలులోకి వెళ్ళే సమయంలో అభ్యర్థులను నిశిత పరిశీలన చేయడం జరుగుతుందని, అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, గాడ్జెస్ అనుమతించబోమని తెలిపారు. ఉదయం గం. 9.30 లకు అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించడం జరుగుతుందని, 10 గంటలకు మెయిన్ గేటు మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. 10.25 లకు ప్రశ్న పత్రాలు అభ్యర్థులకు పంపిణీ చేయడం, గం. 10.30 లకు పరీక్ష ప్రారంభం అవుతుందని తెలిపారు. మధ్యాహ్నం గం.1.25 లకు హెచ్చరిక గంట మోగించబడుతుందని, చివరగా గం.1.30 లకు పరీక్ష నిర్వహణ పూర్తయి జవాబు పత్రాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు సమయ పాలన పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ వి. విక్టర్ మాట్లాడుతూ, అభ్యర్థులు సమయానుకూలంగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, మాస్ కాపీయింగ్ కు పాల్పడకూడదని తెలిపారు. ఇన్విజిలేటర్లు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఆర్డీఓ వీణ, చీఫ్ సూపరింటెండెంట్ విశ్వ ప్రసాద్, పరిశీలకులు శంకర్, జిల్లా విద్య శాఖాధికారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పరిశుద్ధ కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలి

### - జిల్లా కలెక్టర్ ఆశీష్ సన్వాన్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



కామారెడ్డి పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 17, అశోక్ నగర్, స్నేహపురి కాలనీ, తదితర వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలోని అన్ని వార్డుల్లో నిరంతర పారిశుధ్య పనులను చేపట్టాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందికి తెలియజేశారు. వర్షాకాలంలో మురికి కాల్వల్లోని నీరు ప్రవహించే విధంగా చూడాలని, మురికి కాల్వలు, రోడ్లపై నీరు నిలవకుండా ఉండేవిధంగా పనులు చేపట్టాలని అన్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఫాగింగ్ చేపట్టాలని తెలిపారు. వార్డుల్లోని ప్రజలు దోమల బారి నుండి కాపాడే విధంగా ఫాగింగ్ నిర్వహించాలని తెలిపారు. మురికి కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, ఇసుక ను జె.సి.బి. తో తొలగించాలని అన్నారు. ప్రతీ వార్డ్ ల ఇంచార్జీలు ప్రతీ రోజు వార్డుల్లో పర్యటించి శానిటేషన్ కార్యక్రమాలు పరిశీలించాలని, అధికారులు కూడా పర్యవేక్షించాలని తెలిపారు. పట్టణంలో ఎలాంటి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా శానిటేషన్ కార్యక్రమాలు సజావుగా నిర్వహించాలని తెలిపారు. త్రాగునీటి పైప్ లైన్ లు లీకేజీ లేకుండా చూడాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, సహాయ ఇంజనీరు శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

**సూర్య నిజామాబాద్ జిల్లా ప్రతినిధి**



గ్రామ పాలన అధికారుల నియామకం కోసం ఈ నెల 25న (ఆదివారం) జరిగే రాత పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. రాత పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై శుక్రవారం ఆయన తన ఛాంబర్లో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష కోసం చేపట్టిన చర్యల గురించి ఆయా శాఖల వారీగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా రాత పరీక్ష జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 330 మంది అభ్యర్థులు గ్రామ పాలన అధికారుల నియామక రాత పరీక్షకు హాజరు కానున్నారని, వీరికి నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.30 గంట వరకు పరీక్ష కొనసాగుతుందని సూచించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని హితవు పలికారు. పరీక్ష ప్రారంభం అయిన మీదట ఆలస్యంగా వచ్చే వారిని లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పర్యవేక్షణ జరపాలని, నియమ నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదులలో అభ్యర్థులకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జిల్లా రవాణా అధికారి ఉమా మహేశ్వరరావు, ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, తహసిల్దార్ బాలరాజు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేటలో ఘనంగా పెద్దమ్మకు బోనాలు

**సూర్య,లింగంపేట్**

లింగంపేట్ మండల కేంద్రంలో పెద్దమ్మకు ముదిరాజ్ కులస్తులు శుక్రవారం ఘనంగా బోనాలు తీశారు.ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ లు ఇంటికో బోనం తీసి డీజే పాటలు,డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యాలు చేస్తూ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా పెద్దమ్మ ఆలయం వరకు వెళ్లారు, నైవేద్యంతో కూడిన బోనాలను అమ్మ వారికి సమర్పించారు.తమను తమ పిల్లలు చల్లంగా చూడాలని పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు దూరిశెట్టి అశోక్,కోశాధికారి గంట్లం బోట్ల అనిల్ కుమార్,ముదిరాజ్ నాయకులు కృష్ణయ్య,మంద ప్రసాద్,కాశీరాం, భాస్కర్,రాములు,ముద్ర సంఘం సభ్యులు ముదిరాజ్ పెద్దలు,మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సొసైటీల్లో అందుబాటులో జీలుగ విత్తనాలు

### - మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్

**సూర్య నిజాంసాగర్**

మండలంలోని అచ్చంపేట్, మల్లూరు సహకార సంఘాల్లో జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీ పై జీలుగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని ఈ పథకంలో భాగంగా నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్, మల్లూరు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 30 క్వింటాళ్ల చొప్పున జీలుగ విత్తనాలు వచ్చాయన్నారు. ఈ విత్తనాలను 50% రాయితీ పై రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు.ఒక బస్తా రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో చల్లుకోవాలన్నారు. విత్తనాల కోసం వచ్చే రైతులు తప్పకుండా పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించి సహకార సంఘాల ద్వారా జీలుగ విత్తనాలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## వరి ధాన్యం త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలి

### - రెవెన్యూ అదనపు కలెక్టర్ వి విక్టర్

**సూర్య కామారెడ్డి జిల్లా ప్రతినిధి**



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) అన్నారు. శుక్రవారం సదాశివనగర్ మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి, కుప్రియల్, కామారెడ్డి మండలంలోని సారంపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభం కానున్న దృశ్య, అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోతున్నదని, వరి పంట తడిసిపోకుండా ముందస్తుగా తూకం వేసి సంబంధిత మిల్లులకు తరలించాలని కేంద్రం ఇంచార్జీలను ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా టార్పాలిన్ లను వరి పంటపై కప్పివేయాలని తెలిపారు. ఆయన వెంట సంబంధిత తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు, కేంద్రాల ఇంచార్జీ లు ఉన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నిక

**సూర్య మాక్లూర్**



మాక్లూర్ మండల మాల మహానాడు మండల కమిటీని జిల్లా అధ్యక్షులు చొక్కా దేవిదాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది .మండలంలోని మానిక్ భండార్ చెక్క వద్ద ఫంక్షన్ హాల్ లో మండల మాల మహనాడు మండల అధ్యక్షులుగా బేగరి రవి, కార్యదర్శిగా నీరడి శంకర్,కోశాదికారి డిసి గంగాధర్, ఉపాధ్యక్షులుగా తిర్మన్పల్లి బోజన్న, ఆసది ఓడ్డెన్న,బ్యాగరి రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సంఘ సభ్యులు మాపై నమ్మకంతో ఎన్నుకున్న మండల మాల సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్,చింతల మోహన్,బోజన్న,బ్యాగరి రవి, మేడే గోపాల్ మండల సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**సూర్య- బాన్సువాడ**




సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం సభ్యులు సూచించారు. నస్రుల్లాబాద్ మండలంలోని కొచ్చర మైసమ్మ ఆలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఆడపిల్లలు, మహిళలపై వేధింపులు, సైబర్, బ్లాక్‌మెయిలింగ్ వంటి నేరాలను ఎలా నివారించాలనే అంశాలపై వివరించారు. సైబర్ నేర గాళ్ళ ఉచ్చులో పడితే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో 100 డయల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. మహిళలకు షీ టీం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ అనిల్, పోలీసు కళాజాత బృందం సభ్యుడు ప్రభాకర్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## పేదోడిసొంత ఇంటి కల ను నెరవేరుస్తున్న ఎమ్మెల్యే మదన్మోహన్

### - భూమి పూజ చేసిన ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు తలారి సతీష్

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి నియోజకవర్గం, లోని గత కొన్ని సంవత్సరాల నుండి ఎల్లారెడ్డి నియోజకవర్గ పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వ పాలకుల అసమర్థ పాలన వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి 3500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఎమ్మెల్యే మదన్మోహన్ మంజూరు చేశారనీ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు తలారి సతీష్ శుక్రవారం అన్నారు అందులో భాగంగా ఎల్లారెడ్డి మండలంలోని గండి మాసనీపేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమి పూజ చేసారు అనంతరం ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షులు తలారి సతీష్ మాట్లాడుతూ ఇంద్రమ్మ ఈళ్ల కు భూమి పూజ చేసినందుకు చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వాడు ఇంచార్జ్ జ్యోతి ఇంద్రమ్మ కమిటీ సభ్యులు సాయ గౌడ్, చంద్రయ్య, సాయిబాబా, నారాయణ లు పాల్గొన్నారు, వాడి ఇన్చార్జి జ్యోతి మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్మోహన్ ఆశిస్తులతో పేదవారు తమ సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారని వారు తెలిపారు ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసినందుకు చాలా ఆనందంగా ఉందని వారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కు ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రట్టి గ్రామస్తులు పాల్గొన్నారు.

